సాక్షి
చిత్తూరు
సోమవారం ၊ 6 ၊ మార్చి ၊ 2023



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.4,700
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	17
తిరుపతి	36	18
తిరుమల	31	14
గూడూరు	35	20
నగరి	36	18



హైబ్రిడ్ రకం..ఆదాయం ఘనం!

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో హైబ్రిడ్ కూరగాయలు రైతులకు లాభాలను తెచ్చిపెడుతున్నాయి. నాజూకైన, రకరకాల సైజుల్లో అందుబాటులోకి వస్తున్నాయి. – 8లో

న్యూస్‌రీల్

బోయకొండలో భక్తుల రద్దీ



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చి ఆరాధ్యదైవంగా విరజిల్లుతున్న బోయకొండ గంగమ్మ తల్లి ఆశీస్సుల కోసం వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ సాగింది. భక్తులు శీఘ్రగతిన దర్శనం చేసుకునేలా ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ, ఈఓ చంద్రమౌళి చర్యలు తీసుకున్నారు. ఎస్ ఐరవికుమార్ నిఘా ఏర్పాటు చేశారు.

జగనన్న వెంటే మేమంతా..

– డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు



మాట్లాడుతున్న డీఎస్సీ అభ్యర్థులు

నాయుడుపేటటౌన్ : పాతికేళ్ల కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటే నడుస్తామని డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని చిన్నదర్గా వద్ద వారు విలేకర్లతో మాట్లాడారు. ఎంటీఎస్ విధానంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించేందుకు కేబినెట్‌లో ఆమోదించిన జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకే మద్దతుగా నిలుస్తామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మొదటి ప్రాధ్యానత ఓటేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఎస్సీ అభ్యర్థులు సంచి వీరాస్వామి, సీహెచ్ కృష్ణారెడ్డి, మురారిశెట్టి, మురళి, ఓట్టురు రవీంద్రయాదవ్, మధుబాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, బి.భాస్కర్ పాల్గొన్నారు.

త్వరలో ఎంపీటీసీ ఎన్నికలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఖాళీగా ఉన్న ఐదు ఎంపీటీసీ స్థానాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రామకుప్పం మండలంలోని మనీంద్రం, వి.కోటలోని ఎస్.బండపల్లె, పూతలపట్టు–1, యాదమరి, ఎస్ఆర్‌పురం మండలం పిళ్లారికుప్పం ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వివరాలను సోమవారం అధికారులు ప్రకటిస్తారన్నారు. ఆమేరకు అభ్యంతరాలు ఉంటే మంగళవారం లోపు తెలపాలన్నారు. అదేరోజు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, అభ్యంతరాలను ఈనెల 9లోగా పరిష్కరించి, 10న పోలింగ్ స్టేషన్ల జాబితాను అందజేసి ఆమోదం పొందిన తర్వాత తుది జాబితా ప్రకటించాలని ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొందని తెలిపారు. ఇదివరకే ఆయా ఎంపీటీసీ స్థానాల పరిధిలో ఓటర్ల జాబితాను ప్రకటించినట్టు ఆయన పేర్కొన్నారు.

ఊరంతా ఉపాధి



యాదమరి మండలం బుడితిరెడ్డిపల్లెలో అమృత్ సరోవర్ పనులు

రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఉపాధి హామీ పథకం పరుగులు తీస్తూ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. సామాజిక తనిఖీల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొదటి స్థానం దక్కడం ప్రభుత్వ పారదర్శక పనితీరుకు నిదర్శనం. పనులు, లబ్ధిదారులకు అందుతున్న నగదుపై సోషల్ ఆడిట్‌లో ఏపీ పనితీరును కేంద్రం ప్రశంసించింది. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో టార్గెట్ 90 లక్షలు కాగా.. ఇప్పటికే 73 లక్షల పనిదినాలు పూర్తి చేశారు. పల్లెల్లో పచ్చదనం, నీరు పరవళ్లు తొక్కేలా పనులు సాగుతున్నాయి.

- జిల్లాలో ఉపాధి పనులతో వలసలకు చెక్
- 2022–2023 టార్గెట్ 90 లక్షలు.. 73 లక్షల పనిదినాలు పూర్తి
- రోజూ 4,875 పనులతో 41 వేల మందికి ఉపాధి
- 31 మండలాల్లోని 647 పంచాయతీల్లో 66 వేల పనులు
- వేతనాల కోసం రూ. 333.68 కోట్లు.. మెటీరియల్స్ కోసం 12.73 కోట్ల ఖర్చు
- సామాజిక తనిఖీలో దేశంలోనే మొదటి స్థానం

సాక్షి, చిత్తూరు: పనుల కోసం వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి కల్పించి ప్రభుత్వం కూలీలకు ఆర్థికంగా ఆసరా కల్పిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, మిల్క్ సెంటర్లు, బృందావనాల నిర్మాణాలతోపాటు చెరువుల ఆధునికీకరణ, కాలువల మరమ్మతులు, రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం, ఉద్యాన పంటలకు సంబంధించి గుంతలు, అమృత్ సరోవర్ పథకం కింద భూగర్భజలాల అభివృద్ధి చర్యలు, గుర్రపు డెక్క తొలగింపు వంటి పనులు చేస్తున్నారు. ఈ పనుల కారణంగా సాగునీరు పుష్కలంగా అందించే అవకాశాలు మెరుగయ్యాయి. తద్వారా వ్యవసాయ రంగానికి ఉపాధి పనులు ఆసరాగా నిలుస్తున్నాయి.

2.58 లక్షల జాబ్‌కార్డులు..100 పనిదినాల లక్ష్యం

జిల్లాలో 2.58 లక్షల జాబ్ కార్డులు ఉండగా.. 4.7 లక్షల మంది కూలీలు ఉన్నారు. జాబ్‌కార్డుపై నమోదైన ఒక కుటుంబానికి ఏడాదికి కనీసం వంద పనిదినాలు కల్పించాలన్నదే లక్ష్యం. కుటుంబంలో ముగ్గురు కంటే ఎక్కువ సభ్యులు ఉన్నా వారికి కనీసం వంద పనిదినాలు కల్పిస్తారు. ఒకరిద్దరు సభ్యులున్న కుటుంబాలే అధికంగా ఉన్నాయి. గ్రామాల్లో పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నూరు రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న వారు 5038 మంది ఉన్నారు. రోజువారీ వేతనం సగటున రూ.242 అందుతోంది. రాష్ట్రంలో ఉపాధి పనుల కల్పనలో జిల్లా రెండో స్థానంలో ఉంది. ఇప్పటివరకు వేతనాల కోసం రూ.333.68 కోట్లు, మెటీరియల్స్ కోసం 12.73 కోట్లు ఖర్చు చేశారు. జిల్లా వ్యాప్తంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశంలో నీడ, మంచినీటి వసతులతో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

73 లక్షల పనిదినాలు పూర్తి

జిల్లా వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 90 లక్షల పది దినాలు లక్ష్యం కాగా, అందులో 73 లక్షల పది దినాలను(81శాతం) పూర్తి చేశారు. మిగిలిన పనులు ఈ నెలాఖరులోపు పూర్తి చేయనున్నారు. జిల్లాలో 700లకు గాను 647 పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. పనుల్లో సర్పంచులను భాగస్వాములు చేశారు. రోజూ 4,875 పనులు చేపడుతున్నారు. వీటి ద్వారా మొత్తం 41 వేల మందికి సరాసరిగా పని కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 66 వేల పనులు చేపట్టారు. 72.84 లక్షల పని దినాలను కల్పించారు.



సదుం మండలంలో పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

31 మండలాలు.. ఐదు క్లస్టర్లలో పనులు

- జిల్లాలోని 31 మండలాలను ఐదు క్లస్టర్లుగా విభజించి పనులు కల్పిస్తున్నారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి వరకు పుంగనూరు, సదుం ,నగరి క్లస్టర్లలో అత్యధిక శాతం పనుల్లో పురోగతి సాధించారు. చిత్తూరు, కుప్పంలో 84 శాతం వరకు పనులు పూర్తి చేశారు.
- చిత్తూరు క్లస్టర్ పరిధిలో 1.5 లక్షల పని దినాల లక్ష్యాన్ని 1.2 లక్షలు(78 శాతం) పూర్తి చేశారు.
- కుప్పం క్లస్టర్ పరిధిలో 1.8 లక్షల పది దినాలు కేటాయించగా 1.5 లక్షల పని దినాలు(81.1 శాతం) పూర్తి చేశారు.
- నగరి క్లస్టర్ పరిధిలో 2.3 లక్షల పని దినాలు కేటాయించగా ఇప్పటివరకు 1.91 లక్షల పది దినాలను(83శాతం) పూర్తి చేశారు.
- పుంగనూరు క్లస్టర్ పరిధిలో 1.45లక్షల పని దినాలను కేటాయించగా 1.17 లక్షల పని దినాలను (80.66శాతం) పూర్తి చేశారు.
- సదుం క్లస్టర్ పరిధిలో 1.87 లక్షల పని దినాలను కేటాయించగా, 1.5 లక్షల పని దినాలను చేరుకుని 81 శాతం పూర్తి చేశారు.

ఉపాధితో పెరిగిన జలమట్టం



అమృత్ సరోవర్ పనులు భూగర్భ జల మట్టాలు పెంపొందించేందుకు ఉపయోగపడుతున్నాయి. మా గ్రామంలో ఉద్యాన పంటలు ఉన్న ప్రాంతంలో అమృత్ సరోవర్ నిర్మించాం. తద్వారా భూగర్భ జల మట్టాలు పెరిగాయి. రైతులు చాలా ఆనందంగా ఉంటున్నారు. – వాసుదేవ రెడ్డి, సర్పంచ్ బుడితిరెడ్డిపల్లె(యాదమరి)

గ్రామస్తుల భాగస్వామ్యంతోనే



సర్పంచ్‌లు ఎంపిక చేసిన పనుల అనుమతి వచ్చిన వెంటనే ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభిస్తాం. పేర్లు నమోదు చేసుకున్న వారినే ఆ పనుల్లో భాగస్వామ్యం కల్పిస్తాం. ఎవరూ వలసలు వెళ్లకుండా ఈ పనులు కొనసాగిస్తాం. –రమ్య, ఇంజినీర్,డ్వామా

రోజుకు 41వేల మందికి ఉపాధి



జిల్లాలో రోజు 41 వేల మందికి ఉపాధి లభిస్తోంది. మార్చి నెలతో ముగిసే సంవత్సరానికి 87 శాతం చేరుకుంటాం. మరో 13 లక్షల పని దినాలను సాధించాల్సి ఉంది. దాన్ని కూడా పూర్తి చేస్తాం. అమృత్ సరోవర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. – గంగా భవానీ, పీడీ డ్వామా, చిత్తూరు

వలసలు అరికట్టేలా శాశ్వత పనులు



వలసలు అరికట్టి ప్రజలకు ఉపయోగపడే శాశ్వత పనులను చేపడుతున్నాం. జిల్లాలో ఉపాధి హామీ పనులు భారీగా జరుగుతున్నాయి. శాశ్వతంగా వ్యవసాయ రంగానికి మరింత ఎక్కువగా ఉపయుక్తమయ్యేలా పనులు చేయిస్తున్నాం. అమృత్ సరోవర్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

– ఎం.హరినారాయణన్, జిల్లా కలెక్టర్

● కోనేటిరాయుని జల విహారం





తెప్పోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం రాత్రి శ్రీదేవి,భూదేవి సమేతంగా మలయప్పస్వామివారు పుష్కరిణిలో జలవిహారం చేశారు. విద్యుద్దీప కాంతుల నడుమ తెప్పపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లను దర్శించి అశేష భక్తులు తన్మయత్వం చెందారు. – తిరుమల

తిరుపతికి ‘వందేభారత్’

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి త్వరలోనే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడిపేందుకు రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. అత్యంత వేగంతో నడిచే ఈ రైలు అందుబాటులోకి వస్తే కేవలం 6 గంటల్లోనే ప్రయాణికులు సికింద్రాబాద్‌కు చేరుకునే వెసులుబాటు వస్తుంది. అయితే తిరుపతి–సికింద్రాబాద్ మధ్య ఏమార్గంలో రైలు నడపాలి, ఏ స్టేషన్లలో స్టాపింగ్ ఇవ్వాలని, టికెట్ ధర ఎంత నిర్ణయించాలి అనే అంశాలపై రైల్వే అధికారులు చర్చిస్తున్నారు.



వందేభారత్ ఎక్స్‌ప్రెస్

జిల్లాకు చేరిన బ్యాలెట్ పేపర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం– నెల్లూరు–చిత్తూరు జిల్లా పట్టభద్రుల, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల మొదటి దశ బ్యాలెట్ పేపర్లు ఆదివారం జిల్లా కేంద్రానికి చేరాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీ బందోబస్తు నడుమ జిల్లాకు పంపింది. వాటిలో ప్రకాశంకు సంబంధించిన వాటిని ఆ జిల్లాకు పంపారు. మిగిలిన బ్యాలెట్ పేపర్లు కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయ స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. రెండో దశలో సోమవారం జిల్లాకు విచ్చేసే పేపర్లను నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు పంపిణీ చేస్తారు. జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు పర్యవేక్షించారు.

నేటి స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు జేసీ వెంకటేశ్వర్ ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కసరత్తు జరుగుతున్నందున స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు.

నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలో ప్రముఖ శైవ క్షేత్రం అయిన మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ, ఆలయ ధర్మకర్త విజయకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి అభిషేకాలు, పూజలు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం రాహుకాల సమయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు దోష నివారణ చేసుకోవచ్చని కోరారు.

కాణిపాకానికి పోటెత్తిన భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆలయంలో హోమాలు నిర్వహించడంతో పాటు ఆదివారం సెలవుదినం కావడంతో ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో రూ.150, రూ.100, ఉచిత క్యూలైన్లు, కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి ఆలయ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీసిటీకి పెట్టుబడుల వెల్లువ



శ్రీసిటీలో పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



శ్రీసిటీ ఎండీ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకుంటున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అమర్‌నాథ్

- విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌లో రూ.7,075 కోట్లకు ఒప్పందాలు

వరదయ్యపాళెం: విశాఖపట్నంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్–2023లో శ్రీసిటీకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. సుమారు రూ.7,075 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు, వర్చువల్ ప్రారంభోత్సవాలు జరిగాయి.అందులో ఇప్పటికే ఉన్న 14 పరిశ్రమలకు సంబంధించి ప్లాంట్ల విస్తరణ కాగా, 5 కొత్త కంపెనీల ప్రతిపాదనలు ఉన్నాయి. విశాఖ పెట్టుబడుల సదస్సు వేదిక నుంచి కేంద్ర పర్యాటక సాంస్కృతికశాఖ మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 14 పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభించగా, అందులో శ్రీసిటీకి సంబంధించి 7 కంపెనీలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఒప్పంద పత్రాల మార్పిడిలో రాష్ట్ర ఇంధనం, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమరనాథ్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఎంఓయూలపై రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని సృష్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులన్నారు. ఆయన ప్రోత్సాహం మార్గదర్శకత్వంలో, శ్రీసిటీ అత్యంత ప్రాధాన్య పెట్టుబడి గమ్యస్థానాలలో ఒకటిగా ఆవిర్భవించిందని వెల్లడించారు. కాగా, శ్రీసిటీకి సంబంధించి వర్చువల్ ప్రారంభోత్సవాలు జరిగిన పరిశ్రమల్లో కింబర్లీ క్లార్క్, బ్లూస్టార్ ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న డైకిన్ పరిశ్రమ స్కిల్ డెవలప్‌మెంట్‌లో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఇతర పెట్టుబడులు పెట్టనున్న జపాన్, యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దక్షిణ కొరియా, జర్మనీతోపాటు మనదేశానికి చెందిన పలు కంపెనీలు లైట్ ఇంజినీరింగ్, ఫార్ములేషన్స్, టెక్స్‌టైల్స్, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ తదితర రంగాలలో పెట్టుబడి ప్రతిపాదనలు తీసుకువచ్చాయి. మొత్తం ఒప్పందాల ద్వారా 1,7500 ఉద్యోగాలు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

లక్ష్మీ గణపతి హవనంతో పవిత్రత

- విశాఖ శారద పీఠాధిపతులు
- మూడు రోజుల హోమ పూజలు పరిసమాప్తం
- కాణిపాకంలో ఆధ్యాత్మిక సందడి



పీఠాధిపతులకు స్వామివారి చిత్ర పటం అందిస్తున్న చైర్మన్,ఈఓ, ప్రజాప్రతినిధులు

కాణిపాకం(యాదమరి): లక్షమోదక లక్ష్మీగణపతి హవనంతో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఎంతో పవిత్రతను సంతరించుకుందని విశాఖ శారద పీఠాధిపతులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతిస్వామి తెలిపారు. ఆలయంలోని కల్యాణ వేదికలో స్వాముల చేతుల మీదుగా మూడో రోజు ఆదివారం కూడా ఉదయం, సాయంత్రం హవన పూజలు నిర్వహించారు. ఉదయం గో పూజ చేసి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. మహాస్వామి మాట్లాడుతూ ఈ హోమం ఇప్పటి వరకు ఏ దేవాలయంలో నిర్వహించలేదని, కాణిపాకం ఆలయంతో పాటు దేశ సుభిక్షతకు తోడ్పడుతుందన్నారు. భక్తులకు లక్ష్మీ గణపతి హవనం విశిష్టతను వివరించారు. ఈక్రతువుకు సంబంధించిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. హోమంలో ఉంచిన పవిత్ర కలశ జలాలను ఆలయం చుట్టు ఊరేగించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అధికారులు పాల్గొన్నారు.

స్వామివారి సేవలో ప్రముఖులు

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, తిరుపతి ఎంపీ గురుమూర్తి, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వారు హోమ పూజల్లో పాల్గొన్నారు.



లక్షమోదక లక్ష్మీగణపతి హవనం శిలాఫలకం ప్రారంభిస్తున్న విశాఖ శారద పీఠాధిపతులు

బిందు తీర్థానికి ప్రత్యేక పూజలు

స్వామివారికి సుప్రభాత సేవలో ఉపయోగించే బిందు తీర్థానికి శ్రీస్వాత్మా నందేంద్ర సరస్వతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్కరిణిలో పూజలు నిర్వహించి తీర్థ జలాలను తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు. పూజలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

పీఆర్‌ఓ కార్యాలయం ప్రారంభం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద పీఆర్‌ఓ కార్యాలయాన్ని శ్రీస్వరూపానందేంద్ర స్వామి ప్రారంభించారు. ఈ కార్యాలయం ద్వారా వీఐపీలకు ప్రోటోకాల్ కల్పించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు.

కల్లుపల్లి వద్ద హైబ్రిడ్ టమాట సాగు



మునగ తోట





మొరం పంచాయతీలో మస్క్‌మిలాన్

హైబ్రిడ్ రకం.. ఆదాయం ఘనం!

- హైబ్రిడ్ కూరగాయల సాగులో రైతులు
- కొత్త వంగడాల పండ్లు సైతం..
- కర్ణాటక రైతుల బాటలో పలమనేరు రైతులు
- తోటల వద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు


పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో హైబ్రిడ్ కూరగాయలు, పండ్ల సాగు రైతులకు లాభాలను తెచ్చిపెడుతోంది. నాజూకైన, నాణ్యతతో రకరకాల సైజుల్లో ఇవి పండుతూ అధిక దిగుబడులు వస్తుండడంతో వీటి సాగుపై రైతాంగం దృష్టిసారిస్తోంది. హైబ్రిడ్ పంటల సాగులో ముందంజలో ఉన్న కర్ణాటకలోని కోలారు, మాలూరు, బెంగళూరు రూరల్ జిల్లాలకు సమీపంలో ఉండడం ఇక్కడి అన్నదాతలకు మరింత అవకాశంగా మారింది. అక్కడి రైతుల అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకుని లాభాలు పొందే వెసులుబాటు వచ్చింది.



తొప్పనపల్లి వద్ద ఎర్ర కర్బూజ పంట



కర్బూజా



చేతికందేలా కొబ్బరికాయలు

పలమనేరు: సంప్రదాయ నాటు రకాలకు స్వస్తి పలికి హైబ్రిడ్ కూరగాయల, పండ్ల సాగుపై పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని రైతులు మక్కువ చూపుతున్నారు. హైబ్రిడ్ రకాలైన టమాట, కాకర, బీర, క్యాబేజీ, బేబీకార్న్, స్వీట్‌కార్న్, ఫెన్సిల్ బీన్సు, జెలపినో మిరప(క్యాప్సికం), కాలిఫ్లవర్, రెడ్‌లేడీ బొప్పాయ, అరటి, కర్బుజా, క్యారెట్, ఎర్ర ముల్లంగి, దోస, మస్కిమిలాన్, చేతికందే మునగ, వంగ, ఎర్రబెండకాయలు, ఎల్లో కర్బ్యూజ ఇలా రకరకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. కల్లుపల్లి, ఉయ్యాలమిట్ట, మొరం, కల్లాడు, చెన్నుపల్లి, కలగటూరు, మారేడుపల్లి, పాతూరునత్తం, నక్కపల్లి, కన్నమాకులపల్లితో పాటు పెద్దపంజాణి, వీకోట, బైరెడ్డిపల్లి, శాంతిపురం మండలాల్లో ఈపంటల సాగు ఎక్కువగా ఉంది.

చెట్టెక్కాల్సిన పని లేదు

ఇప్పటి వరకు కొబ్బరిబొండాం కోసం చెట్టు ఎక్కాల్సిందే. కాని హైబ్రిడ్ రకాల్లో నిలబడి కాయలను కోసుకోవచ్చు. కొలమాసనపల్లె సమీపంలో ఓ రైతు వీటిని సాగుచేశాడు. జామ కాయల కోసం చెట్లు ఎక్కాల్సిన పనిలేదు. తైవాన్ జామ, వీఎస్ఆర్ బిహి రకం జామ చెట్లు కేవలం మూడు నుంచి ఐదుడుగులే. ఓ జామకాయ బరువు నాలుగునుంచి ఆరు కిలోలు ఉంటుంది. గంగవరం మండలంలోని కల్లుపల్లి వద్ద దేవేంద్రనాయుడు, ఉయ్యాలమిట్ట వద్ద బాబునాయుడు ఈ హైబ్రిడ్ జామతోటలను పెంచారు. పొట్టిరకం మామిడిని సైతం ఈ ప్రాంతంలోని కొందరు రైతులు వినూత్నంగా సాగు చేస్తున్నారు.

కర్ణాటక రైతులే ఆదర్శం

పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాలకు ఆనుకుని ఉన్న కర్ణాటక ప్రాంతంలోని రైతులు 15 రకాల కూరగాయలు, ఏడు రకాల పండ్ల తోటలను పూర్తిగా హైబ్రిడ్ రకాలతో నాలుగైదేళ్లుగా సాగుచేస్తున్నారు. వీరి సాగు, అక్కడి రైతుల అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ ఇక్కడి రైతులు స్థానికంగా ఈ పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

మంచి మార్కెటింగ్ సౌకర్యం...

పలమనేరు నుంచి బెంగళూరు, చెన్నై, విజయవాడ, హైదరాబాద్, సేలం, మంగళూరు ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ బాగుంది. ఇక్కడ మూడు జాతీయ రహదారులుండడంతో ట్రాన్స్‌పోర్ట్‌కు అనుకూలంగా మారింది. కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు ఇక్కడి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి పండించే హైబ్రిడ్ బొప్పాయిని ఢిల్లీ వ్యాపారులు తోటలవద్దే కొంటున్నారు.

అందుబాటులో సీడ్స్

హైబ్రిడ్ రకాల కూరగాయలు, పండ్లుకు సంబంధించి దేశీయ, విదేశీ సీడ్స్ కంపెనీల సీడ్స్, కొత్త వంగడాలు అందుబాటులో ఉన్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టీకల్చర్ అండ్ రీసెర్చ్ ద్వారా కుప్పం సమీపంలోని పెద్దబంగారునత్తంలో సెంటర్‌ఫర్ ఎక్సెలెన్స్‌ఫర్ విజటబుల్స్‌లో కొత్త వంగడాలపై ప్రయోగాలు చేసి సృష్టిస్తున్నారు. వీటిని ఇక్కడి రైతులకు పంపిణీ చేసి ప్రయోగాత్మకంగా సాగు చేయిస్తున్నారు.



దోస





ఎర్రబెండ



తైవాన్ బిహి(చేతికందే జామ)



బొప్పాయి

నాలుగైదు రాష్ట్రాల్లో మార్కెటింగ్ ..



కొన్నేళ్లుగా హైబ్రిడ్ రకాలను సాగుచేస్తున్నాను. మస్క్‌మిలాన్, కోహినూర్ ఎల్లో కర్బూజ, మెడిసిన్ దోస, గుమ్మడి లాంటి పంటలను ఎక్కువగా చేస్తున్నాను. నాలుగైదు రాష్ట్రాల్లో మార్కెటింగ్ చేస్తుంటా. కొత్త వెరైటీ కావాలంటే ఆ కంపెనీకి చెందిన మార్కెటింగ్ ప్రతినిధులను సంప్రదిస్తే చాలు. వారే సీడ్స్‌ను ఇచ్చి సాగు అనుమానాలను నివృత్తి చేస్తుంటారు.

– గజేంద్ర, తొప్పనపల్లె

పలు రకాల వంగడాలు



దేశీయ కంపెనీలతో పాటు అంతర్జాతీయ సీడ్స్ కంపెనీల సీడ్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంత వాతారవరణం అన్ని రకాల కూరగాయల పంటల సాగుకు అనుకూలంగా ఉంది. రైతులకు నూతన వంగడాల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తిగల రైతులకు అవరసమైన సూచనలిస్తున్నాం. కుప్పంలోని సెంటర్‌ఫర్ ఎక్సలెన్స్‌లో పలు రకాల కొత్తవంగడాలను రూపొందిస్తున్నాం.

– డాక్టర్ కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

ఎమరాల్డ్స్ టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమరాల్డ్స్ విద్యాసంస్థల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఎమరాల్డ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన లభించినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు ఇ.గిరిధర్‌రెడ్డి, కె.విశ్వనాథరెడ్డి తెలిపారు. సుమారు 600కు మందికిపైగా పదో తరగతి విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఇందులో రత్నం స్కూల్‌కు చెందిన పి.నాగసుమ మొదటి ర్యాంకు సాధించి రూ.10 వేలు గెలుపొందిందన్నారు. అలాగే గౌతం స్కూల్‌కు చెందిన కె.భావన రెండో ర్యాంకు, జేసీఆర్ చైతన్య స్కూల్‌కు చెందిన సి.యశ్వంత్‌రెడ్డి మూడో ర్యాంకు సాధించి రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమరాల్డ్స్ విద్యాసంస్థల డైరెక్టర్లతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు ఎస్.మునిరత్నం, టి.శ్రీనివాసులు ఎస్.జానకిరామ్, ఎ.పార్థసారథి, టి.నాదముని పాల్గొన్నారు.

సీఎంసీకి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పూతలపట్టు: తమిళనాడు రాష్ట్రం వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్న మండలంలోని ఎం.బండపల్లెకు చెందిన హేమాద్రికి ఆదివారం వలంటీర్ పింఛన్ అందజేశారు. అనారోగ్యంతో ఆయన సీఎంసీలో చికిత్స పొందుతున్నారని తెలుసుకుని వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. వలంటీర్ సేవలను మండల అధికారులు అభినందించారు.

జిల్లా అధ్యక్షుడిగా చిట్టిబాబు



చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా పీసీఆర్ ప్రభుత్వ కళాశాల లెక్చరర్ చిట్టిబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపినాయక్ ప్రకటించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనకు పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

యువకుల ఘర్షణ..

కేవీబీపురం: ఇద్దరు యువకులు ఘర్షణ పడి, పరస్పరం దాడులకు దిగడంతో కత్తిపోట్ల వరకు దారి తీసిన ఘటన కేవీబీపురం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాగిగుంట గ్రామానికి చెందిన బొబ్బిలి శ్యామ్ అనే యువకుడు స్థానికంగా కూల్‌డ్రింక్ షాపు నడుపుతున్నాడు. ఆ షాపులో మద్యం విక్రయిస్తున్నారని ఢిల్లీబాబు (23) అనే యువకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడన్న సందేహంతో శ్యామ్, ఢిల్లీబాబు బాబాయ్‌తో వాగ్వావాదానికి దిగాడు. దీంతో ఢిల్లీబాబు జోక్యం చేసుకుని శ్యామ్‌ని ఇనుపచువ్వతో వీపుపై పొడిచి గాయపరిచాడు. దీంతో శ్యామ్ ఇంటికెళ్లి కత్తి తీసుకొచ్చి ఢిల్లీబాబుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన ఇద్దరు యువకుల్ని కుటుంబసభ్యులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విచారించి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సునీల్ తెలిపారు. ఢిల్లీబాబును మెరుగైన వైద్యం కోసం తిరుపతికి సిఫారసు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్టు సీఐ శ్రీహరి తెలిపారు. సూళ్లూరుపేటకు చెందిన వినోద్(46), శ్రీనివాసులు (43) ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయలుదేరారు. సీతారాంపేట వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపుతప్పి కింద పడ్డారు. గాయపడిన వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిల్లకూరు : మండలంలోని కడివేడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1,500 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు. దాడిలో కానిస్టేబుళ్లు భాస్కర్, నరేష్, విష్ణు, రామచంద్రయ్య, పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

62 మందికి జరిమానా



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ భాస్కర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: నగరంలో ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘించిన 62 మందికి జరిమానా విధించినట్లు సీఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. నగరంలో ఆదివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 35 మంది ట్రిపుల్ రైడింగ్, 18 మంది మైనర్లు, తొమ్మిది మంది నంబర్ ప్లేట్ లేని వాహనాలు, మొత్తం 62 మందిని గుర్తించామన్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, జరిమానా విధించినట్లు వెల్లడించారు.

వేర్వేరు చోట్ల మూడు అగ్నిప్రమాదాలు



మామిడి తోటలో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

పుంగనూరు: మండలంలో ఆదివారం మూడు వేర్వేరు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. గూడూరుపల్లెలో గోపాల్‌కు చెందిన గడ్డివామి వేకువజామున జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. అలాగే పట్టణంలోని ఎంఎస్ఆర్ థియేటర్ వెనుక రమేష్‌బాబుకు చెందిన వెదురుతోపులో మంటలు చెలరేగాయి. రామసముద్రం మండలం మినికి గ్రామంలో మధ్యాహ్నం మామిడి తోటలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖాధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనల ప్రాంతాలకు వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ వేసవి కావడంతో మామిడి తోటలు, గడ్డివాములు, పంటల వద్ద ఎవరైనా ఆకతాయిలు బీడీలు,సిగరెట్లు ఆర్పకుండా పడవేస్తే మంటలు చెలరేగుతాయన్నారు. రైతులు పొలాల సరిహద్దుల్లో ఎండు ఆకులు, చెత్త లేకుండ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మృతి చెందిన మల్లయ్య

సోమల: మండలంలోని తమ్మినాయనిపల్లె దారిలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీ కొన్న ప్రమా దంలో ఇదే పంచాయతీ కురవపల్లెకు చెందిన మల్లయ్య(73) మృతి చెందాడు. ఈఘటనలో తీవ్రంగా గాయ పడిన పేగలవారిపల్లెకు చెందిన ద్విచక్రవాహనదారుడు సురేంద్రను 108 వాహనంలో కలికిరికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.